

నమస్తే తెలంగాణ
నిజామాబాద్
ఆదివారం 26 నవంబర్ 2023


# ధరణితోనే దర్జా..

- పారదర్శక వ్యవస్థను రూపుమాపే కుట్ర
- అన్నదాతలను ఆగం చేసేందుకు హస్తం యత్నం
- ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెసోళ్ల జిమ్మిక్కులు
- కాంగ్రెస్ వస్తే మా భూములకు గ్యారంటీ లేదంటున్న రైతులు

ధరణి




## ధరణితో సమస్యలన్నీ తీరినాయ్..



ఎన్నో ఏండ్లుగా పరిష్కారానికి నోచుకోని భూముల సమస్యలు బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణితో తీరిపోయాయి. అంతకు ముందు బ్యాంకులోను కావాలంటే పహాణి నఖళ్ల కోసం ఆపీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆన్‌లైన్‌లో పహాణీలు లభిస్తుండడంతో ఎవరి దగ్గరికీ వెళ్లకుండానే క్షణాల్లో పహాణీలు, నఖళ్లు వస్తున్నాయి. ధరణి రావడం వల్ల రైతుబంధు, రైతుబీమా వస్తోంది. రూపాయి అప్పులేకుండా పెట్టుబడి అందుతున్నది. గుంట భూమి కూడా మనకు తెలియకుండా ఇతరుల పేరిట పట్టా కావడంలేదు. రైతుల మేలు కోసం ఇంతగా ఆలోచిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపిస్తాం.

**- అశోక్, సుంకిని, ఉమ్మడి కోటగిరి మండలం**

## కాంగ్రెస్ వస్తే రైతులకు నష్టమే..



తెలంగాణ ప్రభుత్వం అచ్చినసంది కేసీఆర్ సార్ ధరణి పోర్టల్‌ను తీసుకు వచ్చి చాలా మంచిగపని చేసిండు. రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపిండు. భూముల విషయంలో గతంలో ఎన్నో తగాదాలు ఉండేవి. ఈ జాగనాది.. ఆ భూమి నీది అంటూ గ్రామాలల్ల రోజూ లొల్లిలే కనిపిస్తుండె. ధరణి వచ్చినంక ఒక్క గొడవ లేదు. ఎవడి భూమి వానిపేరుమీద వస్తున్నది. రూపాయి ఖర్సు లేకుండా పట్టదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నరు. కాంగ్రెస్ వస్తే రైతులకు అన్నింటా నష్టమే. వాళ్లు గెలిస్తే ధరణి పోర్టల్‌ను తీసేస్తరంట. రైతులు ఊరుకుంటరా. కాంగ్రెసోళ్లను బొందవెడ్తరు.

**-దండు మల్లవ్వ, ఎడపల్లి**

## ధరణితోని రైతులకు మేలు...



ధరణితోని రైతులకు చాలా మేలు జరుగుతున్నది. ఎక్కువగా తిరుగుడు లేదు. భూమి అమ్మాలన్నా.. కొనాలన్నా.. మీ సేవ కేంద్రానికి పోయి దరఖాస్తు పెట్టుకుంటున్నం. ఒక్క రోజులోనే భూమిని బదలాయిస్తున్నరు. అదికూడా మండలకేంద్రంలోనే. అమ్మినోళ్లు, కొన్నోళ్ల ఏలిముద్ర తీసుకుంటున్నరు. తహసీల్దార్ ఆఫీసులో గంట లోపట పనంతా అయిపోతున్నది. వారం లోపట పాస్‌బుక్కు చేతిలో పెడుతున్నరు. ఇంత మంచి సౌలత్‌ను ఎవరన్నా వద్దనుకుంటరా? కాంగ్రెస్ నాయకులు ధరణిని తీసేస్తాం.. భూమాత అని కొత్తగా తెస్తాం అంటున్నరు. మళ్లీ మొదటికి తెచ్చేటట్టున్నరు. వాళ్లకు ఓటేసుడెందుకు.. ఆగమాగం చేసుకునుడెందుకు? ఈ గవర్నమెంటే బాగుంది. బీఆర్ఎస్‌కే ఓటేస్తాం.

**-మేదరి చిన్నులు, ఎడపల్లి**

## ధరణి పోతే.. దళారుల సంత వస్తది..



కాంగ్రెస్ అంటేనే దళారులు. భూముల రిజిస్ట్రేషన్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ చాలా బాగున్నది. దీన్ని రద్దు చేస్తామంటున్నరు. ధరణి పోతే మళ్లీ పాతకథనే. దళారుల సంత వస్తుంది. రైతులకు సమస్యలు మొదలైతాయి. వానికిన్నీ.. వీనికిన్ని.. పైసల్ ముట్టజెప్పాలె. పేర్లన్నీ కిందికి మీదికి చేస్తరు. రోజూ గొడవలే ఉంటాయి. మళ్లీ పాత రోజులు వస్తాయి. మంచిగున్న దాన్ని ఖరాబ్ చేస్తామంటే ఎట్లా? కాంగ్రెస్‌కు ఓటు వేయాలంటెనే భయమైతున్నది. ఇప్పుడున్న సర్కారుతో భూమి గొడవలు కనిపిస్తున్నయా.. ఎవడి భూమి వాడికే ఉన్నది. కబ్జాలనే భయమే లేదు. అందుకే మళ్లీ బీఆర్ఎస్ సర్కారు రావాలె..

**- ఉప్ప పాశెట్టి, ఎడపల్లి**

## ధరణిని రద్దు చేస్తే భూమి గొడవలు తప్పవు..



కాంగ్రెస్ ప్రభుత్వంలోకి రాగానే ధరణి పోర్టల్ రద్దు చేస్తామని అంటున్నారు. ఇదంతా ఇబ్బందులకు గురిచేయడం తప్ప మరోటి కాదు. ధరణితో సులభంగా మారిన భూ రిజిస్ట్రేషన్లు మళ్లీ మొదటికి వస్తాయి. ఏండ్ల తరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం కేవలం ధరణితో జరిగింది. మధ్యవర్తిత్వం లేకుండా స్థానికంగానే, ఏ మండలానికి చెందిన భూములు ఆ మండలాల్లోనే లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు కాలయాపన లేకుండా చేస్తున్నారు. ఎవరి ప్రమేయం లేకుండా ఆన్‌లైన్ ద్వారా కొనసాగుతున్న ప్రక్రియను రద్దు చేస్తే తిరిగి మధ్యవర్తులు, అధికారుల చేతివాటం మొదలవుతుంది. గ్రామాల్లో భూ తగాదాలు చోటుచేసుకుంటాయి. ధరణితో మేలు తప్ప ఇప్పటి వరకు ఏ ఒక్కరూ నష్టపోలేదు.

**-ఎండీ ఉస్మాన్, నర్సాపూర్, బోధన్ మండలం**

## కాంగ్రెస్ వస్తే.. దళారులు, తగాదాలే..



సీఎం కేసీఆర్ రైతుల కోసం చాలా పథకాలు అందుబాటులోకి తెచ్చారు. ధరణి పోర్టల్ ద్వారా భూ సమస్యలను దూరం చేశారు. కబ్జాలు, అక్రమాలకు చెక్ పెట్టారు. గతంలో ధరణి లేనప్పుడు మొత్తం దళారుల రాజ్యమే ఉండేది. భూ కబ్జాలు, తగాదాలు కనిపించేవి. డబ్బు, పలుకుబడి ఉన్నోడిదే భూమి అన్నట్లు ఉండేది. రికార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకొని అనేక అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో చాలా మంది బక్క రైతులు గోసపడ్డారు. భూముల విషయంలో నిత్యం కొట్టుకు సచ్చేవారు. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన తగాదాలతో ఇంకా కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు చాలా మంది ఉన్నారు. ప్రత్యేక తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం భూములను పకడ్బందీగా ధరణి పోర్టల్‌లో భద్రపర్చింది. అలాంటి సౌకర్యాన్ని కాంగ్రెస్ నాయకులు తీసేస్తామని అంటున్నారు. మళ్లీ రైతుల భూములను కొట్టేసి, దళారులకు అప్పజెపాలని చూస్తున్నరు.

**- వీరభద్రరావు, సుంకిని, ఉమ్మడి కోటగిరి మండలం.**

## ధరణి రద్దు చేస్తామనడం దుర్మార్గపు ఆలోచన



రైతులు పడుతున్న బాధలు పోవాలనే ముందుచూపుతోని కేసీఆర్ ప్రభుత్వం మంచి నిర్ణయంతో ధరణి పోర్టల్‌ను పెట్టింది. అప్పటి నుంచి భూములు కొనుడు, అమ్మకాలు అన్నీ తహసీల్ ఆఫీసు లోనే అయిపోతున్నాయి. ఇంత మంచిగా ఉన్న ధరణిని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రద్దు చేస్తామనడం దుర్మార్గమైన ఆలోచన. ధరణితోని రైతులు చాలా ఆనందంగా ఉన్నారు. ధరణి వద్దని చెప్పేవారికి తగిన బుద్ధి చెబుతాం. కేసీఆర్‌ను గెలిపించుకుంటాం.

**-కుమ్మరి నర్సయ్య, జంలం, ఎడపల్లి మండలం**